క్లుప్తంగా

కరెంట్ అఫైర్స్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న హరికృష్ణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో గల లైబ్రరీ స్టడీహాల్ విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ తొమ్మిది నెలల కరెంట్ అఫైర్స్ పుస్తకాలను ఉచితంగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అందజేసిన కరెంట్ అఫైర్స్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

సమాజంలో వృద్ధులను గౌరవించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: వృద్ధులకు విలువనిచ్చే సమాజాన్ని ఏర్పాటు చేసుకుందామని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. పట్టణంలోని కేఆర్‌కేలో గల వృద్ధాశ్రమంలో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు గంగేశ్వర్, సెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'దుండగులను ఉరితీయాలి'

ఆదిలాబాద్‌టౌన్: అత్యాచారం చేసిన దుండగులను ఉరితీయాలని టైగర్ గ్రూప్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో నిరసన చేపట్టారు. ఇటీవల పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి మూడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామ మాజీ సర్పంచ్ జాదవ్ ప్రేమలబాయి (59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పిప్పల్‌కోటి గ్రామ సర్పంచ్‌గా 2014 నుంచి 2019 వరకు సేవలందించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం ఇంటిలోనే మృతి చెందింది.

యువత క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: యువత క్రీడల్లో రాణించాలని ఉట్నూర్ ఎస్సై మనోహర్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ మండలంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొంది మొదటి బహుమతి సాధించిన ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ జట్టును స్థానిక పోలీసు స్టేషన్‌లో అభినందిస్తూ వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా రెండో ర్యాంకర్‌కు సన్మానం



బోనగిరి సారికను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయి రెండో ర్యాంకు సాధించిన మండల కేంద్రానికి చెందిన బోనగిరి సారికను పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్‌టీవీ ప్రసాద్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రావుల శంకర్‌లు బుధవారం సత్కరించారు.

మహాత్ముడికి ఘన నివాళి

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని లయన్స్ క్లబ్ కింగ్ అండ్ కాటన్ సిటీ ఆధ్వర్యంలో, ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు గాంధీ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీజి చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: గాంధీ వేషధారణలో చిన్నారులు



బోథ్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



సిరికొండ: మండల కేంద్రంలో..



నార్నూర్: మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద..



తాంసి: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి, గ్రామస్తులు



ఆదిలాబాద్‌టౌన్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



ఇంద్రవెల్లి: మర్కగూడలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆదివాసీలు



కైలాస్‌నగర్: పరిసరాలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: జాతిపిత మహాత్మగాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకొని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తడిసేన వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేశ్, సీనియర్ నాయకులు నలిమేలా నవీన్ రెడ్డి, రహీమ్ ఖాన్, నాయకులు మర్సుకోల గౌతమ్, పరాంకుశం వెంకటేశ్, ఎంబడి బాలకృష్ణ, లస్మన్న పాల్గొన్నారు.

ఒకరిపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన సమీపంలో ఓ వ్యక్తిపై పలువురు హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని అర్నికి చెందిన ఇజ్రాయిల్‌కు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనుమానించిన పలువురు ఆయనను రాంపూర్ వద్దకు పిలిపించారు. బుధవారం అక్కడికి వచ్చిన ఇజ్రాయిల్‌పై లక్షెట్టిపేటకు చెందిన అఫ్రోజ్‌తోపాటు పలువురు దాడి చేశారు. తీవ్రంగా గాయాలపాలైన ఆయన అక్కడి నుంచి తప్పించుకొని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ సంబరాలు



నార్నూర్: బతుకమ్మలతో చిన్నారులు, టీచర్లు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి కే అంగన్వాడీ కేంద్రంలో బుధవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శారద మాట్లాడుతూ తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంగన్వాడీ టీచర్లు సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్: బతుకమ్మతో ఆర్టీసీ సిబ్బంది

ఆర్టీసీ బస్టాండ్‌లో బతుకమ్మ ఏర్పాటు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

దర్జీ కుమార్తెకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న గంగామణి

బోథ్: మండల కేంద్రానికి చెందిన దర్జీ సింగు అనసూయ, రాజన్నల ద్వితీయ కుమార్తె సింగు గంగామణి విద్యా విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. తమిళనాడు రాష్ట్రంలోని స్టేట్ టీచర్స్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయంలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేశారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి మంగళవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆమెకు పట్టా అందించారు. ఆమె ప్రస్తుతం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో సైకాలజీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తోంది. కాగా ఆమె బీఎడ్, డీఎడ్ కోర్సులకు సంబంధించిన నాలుగు పుస్తకాలను రాశారు. పీహెచ్‌డీ పట్టా అందుకున్న గంగామణిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.



డాక్టరేట్‌తో శ్రీనివాస్

డిగ్రీ లెక్చరర్‌కు డాక్టరేట్ ప్రదానం

ఉట్నూర్‌రూరల్: వృక్ష శాస్త్రంలో మొక్కల పెరుగుదల అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ మరడా శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బాటనీలో మొక్కల పెరుగుదల, ఖనిజ పోషణపై ఉపయోగకర సూక్ష్మజీవుల ప్రభావం అనే అంశంపై రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీలో మంగళవారం డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు ఆయన తెలిపారు. డాక్టరేట్ పట్టా అందుకోవడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

'జాలం సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం'



నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్: బంజారా దిగ్గజం, సామాజికవేత్త, కీర్తిశేషులు బానోత్ జాలం సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బానోత్ జాలంసింగ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. మాజీ సర్పంచ్ బానోతు గజానంద్ నాయక్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పుస్కర్ జ్ఞానోబా, మాజీ జెడ్పీటీసీ బ్రిజులల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ దాదాఅలీ, గ్రామ పెద్దలు యశ్వంత్ రావు చౌహాన్, శివాజీ పటేల్, ఉప సర్పంచ్ మహేందర్ తదితరులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలి

నేరడిగొండ: టోల్‌ప్లాజా ఉద్యోగులను ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులుగా గుర్తించాలని రోల్ మామడ టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం టోల్‌ప్లాజా కాంప్లెక్స్‌లో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టోల్‌ప్లాజా ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగులుగా తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. టోల్‌ప్లాజా యూనియన్ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి షేక్ అహ్మద్, ఉపాధ్యక్షులు గోవన్ సింగ్, రమేశ్, నాయకులు సురేందర్ సింగ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి

- ఎంపీ గోడం నగేశ్




స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ కాలనీలో బుధవారం సేవా పక్వాడ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. రవీంద్రనగర్ శ్రీ ఉమామహేశ్వర ఆలయం, ఖానాపూర్ చెరువు పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీన సేవ పక్వాడ కార్యక్రమం ప్రారంభమై, అక్టోబర్ 2వ తేదీతో ముగిసిందన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పక్వాడ కార్యక్రమాన్ని దేశంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఆదినాథ్, లాల మున్నా, జోగురవి, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, రాజేశ్, భీమ్సేన్ రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్, గొర్ల రాము, భూమారెడ్డి, వేదవ్యాస్, సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుపేదల ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదు'

ఆదిలాబాద్: నిరుపేదల ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో అధికారుల సర్వే నేపథ్యంలో ఎమ్మెల్యే పర్యటించి, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రజలను ఆందోళనకు గురి చేయడం సరికాదన్నారు. 2004లోనే నిరుపేదలకు ఇళ్లను కేటాయించిన ప్రభుత్వం, ప్రస్తుతం కూల్చివేత గురించి సన్నాహాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. చెరువులో ఆక్రమణలు చేసిన పెద్దవారి భూములను ముందుగా కూల్చేయాలన్నారు. బీజేపీ పేదలకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నాయకులు లాలామున్న, ఆకుల ప్రవీణ్, జోగు రవి, కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, రాజేశ్, శ్రీనివాస్ కృష్ణ యాదవ్ అర్జున్, సతీశ్, విజయ్, భీమ్సేన్ రెడ్డి, మల్లు తదితరులు ఉన్నారు.

రావమ్మా.. దుర్గమ్మా..!



ప్రతిష్ఠాపనకు సిద్ధమైన అమ్మవారి ప్రతిమలు



అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దుతున్న కళాకారులు



అందంగా తీర్చిదిద్దిన ప్రతిమను ఆసక్తిగా చూస్తున్న యువతులు

ఆదిలాబాద్: నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారిని కొలువుదీర్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండపాల్లో ప్రతిష్ఠించడానికి అమ్మవారి ప్రతిమలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధల నడుమ భక్తులు అమ్మవారిని కొలవనున్నారు.

'గిరి' బాలికల ఆరోగ్యంపై దృష్టి

- కొనసాగుతున్న గిరిజన పోషణ్ అభియాన్
- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు
- జిల్లాలోని 21 ఆశ్రమ పాఠశాలల్లో 7,031 మంది విద్యార్థినులు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న గిరిజన బాలికలను గుర్తించేందుకు ఐటీడీఏ గిరిజన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న చాలా మంది బాలికలు రక్తహీనత కారణంగా చదువుపై అంతగా దృష్టి సారించలేకపోతున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు గిరిజన పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 21న ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా జిల్లాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాలికల రక్త నమూనాలు సేకరిస్తున్నారు.

జిల్లాలో 7,031 మంది బాలికలు

జిల్లాలో మొత్తం 54 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 21 బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉండగా 7,031 మంది బాలికలు ఉన్నారు. 23 బాలుర వసతి గృహాలు ఉండగా 7,685 మంది బాలురు ఉన్నారు. అయితే ఆశ్రమ పాఠశాలల్లో 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన గిరిజన పోషణ్ అభియాన్ శిబిరాలలో రక్త నమూనాలు సేకరించగా అందులో 8 శాతం నుంచి 10 శాతం మంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

ప్రత్యేక దృష్టి..

జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో ఉంటూ పలువురు బాలికలు రక్తహీనతతో బాధపడుతుండడంతో అలాంటి వారిలో రక్తం (హెచ్‌బీ) పెరిగేందుకు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన భోజనం అందించనున్నారు. వసతిగృహ ఆవరణల్లో ప్రత్యేకమైన కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం, అందులో ఆకుకూరలు పెంచడంతో పాటు ఇతర పండ్ల తోటలను పెంచనున్నారు.

ప్రత్యేక వైద్యశిబిరాలు



ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న కొంత మంది బాలికలు రక్త హీనతతో బాధపడుతున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించాం. వచ్చినా రిపోర్టు ఆధారంగా రక్త హీనతతో బాధపడుతున్న బాలికలకు చికిత్స అందిస్తాం.

– డాక్టర్ సర్ఫరాజ్, మెడికల్ ఆఫీసర్

స్టేడియం మంజూరు చేయాలి

వాంకిడి: మండల కేంద్రంలో మినీ ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీపక్ ముండే బుధవారం రాష్ట్ర యువజన, క్రీడల విభాగం చైర్మన్ శివసేన రెడ్డికి వినతిపత్రం అందజేశారు.